
తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు

తెలంగాణ

# జీవగడ్డ

ఎడిటర్:
మోటపలుకుల వెంకట్

డిజిటల్ పత్రిక








ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , బుధవారం 11-02-2026 సంపుటి :02 సంచిక : 122 పేజీలు :04 వెల : 3.00





## బాబ్రీ పునర్నిర్మాణం అసాధ్యం

**యోగి ఆదిత్యనాథ్**

బారాబంకి: అయోధ్యలో బాబ్రీ మసీదు పునర్నిర్మాణం అసాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు.

# ఎన్నికల ప్రచారానికి తెర-ప్రలోభాల ఎర




# మున్సిపల్ ఎన్నికలు

## సెలవు ప్రకటించిన సర్కార్




తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రేపు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది

3


# 100 శాతం విజయం మాదే



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 10 :**

మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వంద శాతం విజయం సాధిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ పట్టణాల్లో మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ప్రచారాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన సన్న బియ్యం పథకంతెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గేమ్ చేంజర్‌గా మారిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. చరిత్రలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా వంద శాతం ఫలితాలు సాధిస్తామన్నారు. పదేళ్లు అధికారంలో ఉండేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశామని, రాబోయే ఎనిమిదేళ్ల కాలంలో తెలంగాణలో ఇంకా అనేక అభివృద్ధి పనులు చేసి తెలంగాణను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా చేయబోతున్నామన్నారు.

# అవిశ్వాస తీర్మానంపై చర్చ



న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానం పై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడుతున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు.

తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక
జనరల్ న్యూస్
బుధవారం
11.02.2026
2

# జైపూర్ పాలకవర్గానికి వైద్యశాఖ అభినందనలు



**తెలంగాణ జీవగడ్డ,జైపూర్**

మంచిర్యాల జిల్లా జైపూర్ లో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గానికి స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు.మంగళవారం వైద్యాధికారి ముస్తఫా మెడికల్ సిబ్బంది తో కలిసి సర్పంచ్ కూన భాస్కర్ తో పాటు ఉపసర్పంచ్ ఇరిగిరాల శ్రవణ్ ను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛంతో అభినంద నలు తెలిపారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ముస్తఫా మాట్లాడుతూ గ్రామీణ ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వారిని కోరారు.గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, త్రాగునీటి సరఫరా,వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహిం చాలని కోరారు.అనంతరం ఆరోగ్య సమస్యల నివారణకు వైద్యశాఖ, పంచాయతీ సిబ్బంది కలిసి పని చేయాలని నిర్ణయిం చారు.ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం వైద్య విభాగం అందించే సహకారంపై చర్చించారు.గ్రామ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సర్పంచ్ భాస్కర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి హామీనిచ్చారు.

# ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి**
**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**తెలంగాణ జీవగడ్డ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ప్రజలు తమ ఓటు హక్కును నియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం ఆయన సుల్తానాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ , మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రామగుండం లోని సరస్వతి శిశు మందిర్,లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అర్బన్ లోకల్ బాడీస్ కు రెండవ సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరుగుతున్నాయని, జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సంబంధిత మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశామని, ప్రతిచోట పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ సామాగ్రిని ప్రశాంతంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. రామగుండంలో ఏకగ్రీవమైన



ఒక డివిజన్ మినహాయించి జిల్లాలోని మిగిలిన 123 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయని, దాదాపు 470 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నా మన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల బయట కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షిస్తామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బంది అవసరమైన సామాగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, సురేష్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, మనోహర్,సంబంధిత తదితరులు పాల్గొన్నారు .

# భారత్-అమెరికా వ్యవసాయ,వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిద్దాం



**ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి**
**వ్యవసాయం రంగంలో స్వామీనాథ్ సిఫారసులను అమలు చేయాలి**
**ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతు**
**తెలంగాణ ప్రజా ఫ్రంట్ నేతల వెల్లడి**

**తెలంగాణ జీవగడ్డ,పెద్దపల్లి**

కేంద్ర ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న వ్యవసాయ, వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య లు అన్నారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికాలో పండించిన పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, పాలు తదితర ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా సున్నాకు తగ్గించడం ద్వారా భారత రైతులను మార్కెట్ నుంచి తప్పించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. అమెరికా ప్రభుత్వం అక్కడి రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తుంటే, మన దేశంలో మాత్రం రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, మోదీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయడం లేదని ఆరోపించారు. దేశంలో దాదాపు 20 కోట్ల రైతు కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయని, రోజుకు సగటున 31 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితుల్లో ఈ ఒప్పందం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు వ్యవసాయ చట్టాల రద్దు సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని, కొత్త విబిజీఆర్ఏంజీ బిల్లు ఎత్తి వేసి పాత



చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని దానికి బడ్జెట్ పూర్తిగా కేంద్రమే భరించాలని, విత్తన బిల్లు, 2025 విద్యుత్ సవరణ బిల్లు, నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు,ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావులు, యువజన, మహిళా అన్ని వర్గాల శ్రామిక ప్రజలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు కె. రాజు, కె.అంజయ్య, బి.సుధాకర్ పాల్గొన్నారు.


తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక



# బాబ్రీ పునర్నిర్మాణం అసాధ్యం

బారాబంకి: అయోధ్యలో బాబ్రీ మసీదు పునర్నిర్మాణం అసాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. బారాబంకిలోని శ్రీరామ్ జానకి ఆలయంలో మంగళవారంనాడు జరిగిన 10వ శ్రీ హనుమాన్ విరాట్ మహాయజ్ఞం, శ్రీ రామార్చా పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు అవకాశవాదులు ఉంటారని, వారికి కష్టాలు వచ్చినప్పుడే రాముడు గుర్తుకు వస్తాడని, ఇతర సమయాల్లో తలవను కూడా తలవరని అన్నారు. అందువల్లే రాముడు కూడా వాళ్లను మరిచిపోతాడని చెప్పారు. 'రాముని భక్తులపై బుల్లెట్లు కురిపించి, రాముడి సేవకు అవాంతరాలు కల్పించే రామద్రోహులకు ఇక్కడ చోటులేదు. బాబ్రీ మసీదును పునర్నిర్మిస్తామని కలలు కంటున్న వారికి ఒకటే చెప్పదలచుకున్నారు. అలాంటి తీర్పుదినం (ఖయామత్) ఎప్పటికీ రాదు' అని స్పష్టం చేశారు.'ఖయామత్ రోజు ఒకటి వస్తుందంటూ ఎదురుచూపులు చూస్తూ జీవితం గడిపేయవద్దు. హిందూస్థాన్‌లో కలిసి జీవించడం నేర్చుకోవాలి. ఈ ధరిత్రి చట్టాలను గౌరవించాలి. మీరు చట్టాన్ని గౌరవించి, ఆ ప్రకారం నడుచుకుంటే లబ్ధి పొందుతారు. లేదంటే మార్గం చాలా స్పష్టంగా ఉంది. చట్టాన్ని ధిక్కరించి ముందుకు వెళ్లే వాళ్లు నరకానికే వెళ్తారు. చట్టాన్ని ధిక్కరించగలమని ఎవరైనా అనుకున్నా, స్వర్గానికి వెళ్తామని అనుకున్నా వారి కలలు ఎప్పటికీ కల్లలుగానే మిగిలిపోతాయి' అని యోగి పేర్కొన్నారు.

# పుస్తకం స్టేటస్ ఇదీ




నరవణే పుస్తకం ఒక్క కాపీ కూడా ప్రచురితం కాలేదంటూ ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చెప్పిన విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో నరవణే పోస్ట్ చేశారు

న్యూఢిల్లీ: 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం దేశ్యాప్తంగా చర్చనీయాంశమవుతుండటంతో ఆ పుస్తక రచయిత, మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణే తొలిసారి స్పందించారు. నరవణే పుస్తకం ఒక్క కాపీ కూడా ప్రచురితం కాలేదంటూ ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చెప్పిన విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'పుస్తకం ప్రస్తుత స్థితి ఇది' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.దీనిపై పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సోమవారంనాడు తొలిసారి వివరణ ఇచ్చింది. పుస్తకం పూర్తి హక్కులను తాము కలిగి ఉన్నామని, పుస్తకం ప్రింట్‌లో కానీ, డిజిటల్‌లో కానీ ఇంకా ప్రచురణ కాలేదని తెలిపింది. ప్రసుతం సర్క్యులేషన్‌లో కాపీలు ఏవైనా ఉన్నా, అందులోని కొన్ని భాగాలు వాడుకున్నా, ఏ ఫార్మెట్‌లో ఉన్నా అది కాపీరైట్ ఉల్లంఘన కిందకే వస్తుందని హెచ్చరించింది. అనధికార సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై లీగల్ చర్యలను పరిశీలిస్తామని తెలిపిందిరెండోసారి వివరణపుస్తకంపై వివాదం మరింత తీవ్రమవుతుండటంతో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మంగళవారం మరోసారి వివరణ ఇచ్చింది. పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని స్పష్టం చేసింది. ప్రీ-ఆర్డర్ కింద అనౌన్స్ చేసిన పుస్తకం, ప్రచురితమైన పుస్తకం ఒకటి కాదని తెలిపింది. పబ్లిషింగ్ విధానాల ప్రకారం ఒక పుస్తకం లాంఛనంగా విడుదలై, రిటైల్ ప్లాట్‌ఫాంలపై అమ్మకాలు చేపట్టినప్పుడు మాత్రమే

# మున్సిపల్ ఎన్నికలు-సెలవు ప్రకటించిన సర్కార్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రేపు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది

హైదరాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి (బుధవారం) పోలింగ్ రోజును సెలవుగా ప్రకటించింది సర్కార్. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది.తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల




సంఘం సిద్ధం చేసింది. రేపు (ఫిబ్రవరి 11) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

---

# ఎన్నికల ప్రచారానికి తెర- ప్రలోభాల ఎర

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/హైదరాబాద్, ఫిబ్రవరి 9 :**

ఎన్నికలు ఏవైనా.. ప్రలోభాలు సర్వసాధారణంగా మారాయి. తాజాగా రాష్ట్రంలో పురపాలక ఎన్నికల ప్రచారానికి తెరపడగా.. ప్రలోభాల పర్వానికి తెరలేచింది! అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు ఏమాత్రం తీసిపోనట్లుగా తాయిలాలు, నగదు పంపిణీ జరుగుతున్నాయి. కొన్ని వార్డుల్లో అభ్యర్థులు పోటీలు పడి మరీ పంపిణీ చేస్తున్నారు. డబ్బు, మద్యం, చీరలు, వంట సామాన్లు.. ఇలా 'కాదేదీ పంపిణీకి అనర్హం' అన్నట్లుగా ఓటర్లకు పంచేసి, వారిని ప్రసన్నం చేసుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఇంతకుముందెన్నడూ లేని విధంగా మునిసిపాలిటీ ఎన్నికల్లో డబ్బు వెదజల్లుతున్నారు. కొందరు తమను గెలిపిస్తే 'బంగారం ఇస్తాం.. పెన్షన్లు ఇస్తాం' అంటూ హామీలు గుప్పిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు పార్టీ ఫండ్ రూపంలో పెద్దమొత్తం ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ డబ్బు కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. సోమవారం రాత్రికే ఆ సొమ్ము చేరాల్సిన చోటుకు చేరిపోతుందని.. మంగళవారం ప్రలోభాలు పతాక స్థాయికి చేరతాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. 11న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుండడంతో ఓట్ల కోసం తమ ప్రత్యర్థి ఎంత ఇవ్వబోతున్నారో పసిగట్టి ఆ మొత్తానికి మించి పంపిణీ చేసేందుకు పలు చోట్ల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. పలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఓటుకు రూ.500-3000 వరకు పంచనున్నట్లు సమాచారం. పార్టీ ఫండ్‌తో పాటు అభ్యర్థులు సొంతంగా కూడా పెద్దమొత్తం పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఓ మునిసిపాలిటీలో అభ్యర్థి ఏకంగా ఓటుకు రూ.30 వేలు పంచుతున్నట్లు తెలిసింది!!రాష్ట్రవ్యాప్తంగా 116 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో హోరాహోరీగా సాగిన ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. ఆయా పురపాలికల్లో ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించడంపై దృష్టి సారించాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ లాంటి కొన్ని జిల్లాల్లో పంపిణీ ప్రారంభమైపోయింది. రంగారెడ్డి జిల్లాలో పంపిణీ కొత్తపుంతలు తొక్కుతోంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న ఆరు పురపాలికల్లో 1.75 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కానీ, ఆయా పార్టీల అభ్యర్థులు చేస్తున్న ఖర్చు అక్షరాల రూ.250 కోట్లపైనే!! అమన్‌గల్లు, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, శంకరపల్లి మొయినాబాద్ పురపాలికల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. శంకరపల్లి, చేవెళ్ల, మొయినాబాద్‌ల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీపడి డబ్బు వెదజల్లుతున్నారు. శంకరపల్లిలోని ఓ వార్డులో అభ్యర్థులు రూ.8 కోట్లకు పైగానే ఖర్చుచేస్తున్నారు. ఈ మునిసిపాలిటీలో మరో నాలుగు వార్డుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. డబ్బు, మందు, మాంసం.. తదితర రూపాల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఓటర్లకు వెండి నాణేలు, టీవీలు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, చీరలు, స్టౌలు పోటీపడి పంచుతున్నారు. అనేక వార్డుల్లో ప్రతి ఇంటికీ కిలో చికెన్, పురుషులకు మద్యం బాటిళ్లు అందజేస్తున్నారు. తమకే ఓటు వేయాలని దేవుడి చిత్రపటాలు ఉంచి ఓటర్లతో ఒట్లు పెట్టించుకుంటున్నారు.వంటింటి సామగ్రి అంతా ఇచ్చేశారు!మొయినాబాద్ మునిసిపాలిటీలోని ఓ వార్డులో అభ్యర్థులు పోటీ పడి ఓటర్లందరికీ వంటింటి సామగ్రి అంతా పంపిణీ చేశారు. ఓ అభ్యర్థి అక్కడ తొలుత ఇంటింటికీ అదనపు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశారు. ఇది తెలుసుకున్న మరో అభ్యర్థి గ్యాస్ స్టౌలు పంపిణీ చేశాడు. మొదటి అభ్యర్థి మళ్లీ ఇంటింటికీ వెళ్లి 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేశాడు. రెండో అభ్యర్థి మరోసారి ఇంటింటికీ కుక్కర్లు ఇచ్చాడు. ఇలా ఆ వార్డులోని ఓటర్లకు వంటింటి సామగ్రి మొత్తం అందింది. ఇది చూసి పక్క వార్డుల్లో కూడా కుక్కర్లు, స్టౌలు, టీవీలు వంటి వస్తువుల పంపిణీ మొదలెట్టారు.శంకరపల్లిలో రూ.50 కోట్లకు పైనే..హైదరాబాద్ శివార్లలోని శంకరపల్లిలో 15 వార్డుల్లో 21,401 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఛైర్మన్ స్థానం జనరల్ కావడంతో ఎక్కువ మంది ఆశలు పెట్టుకున్నారు. 8, 10, 13, 14, 15 వార్డుల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు రూ.కోట్లు వెదజల్లుతున్నారు. ఒక్కో వార్డులో అన్ని పార్టీలు కలిపి రూ.6-8 కోట్ల వరకు పంపిణీ చేస్తుండడం గమనార్హం. ఒక్కో ఓటుకు రూ.25-30 వేల చొప్పున ఇస్తున్నారు. ఓ వార్డు నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థి ఇంటింటికీచీరలు, వెండి నాణెంతో పాటు ఓటుకు30 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. తన ప్రత్యర్థి పోటీ వస్తే రూ.40 వేలైనా ఇచ్చేందుకు సిద్ధమని చెబుతున్నాడు. ఇక్కడ అభ్యర్థులంతా కలిసి దాదాపు రూ.50 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నారు.చేవెళ్ల ఛైర్మన్‌గిరీ కోసం రూ.15 కోట్లు!చేవెళ్లలో ఛైర్మన్ పదవి ఆశిస్తున్న ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఇప్పటికే రూ.15 కోట్లు ఖర్చుపెట్టారు. మునిసిపాలిటీలో తమ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వార్డు అభ్యర్థులు ఒక్కొక్కరికీ రూ.30-50 లక్షల వరకు ఇచ్చారు. ఇవిగాక స్థానిక నేతలకు రూ.8 కోట్లకుపైనే ఇచ్చినట్లు సమాచారం. షాద్‌నగర్‌లో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి కూడా స్థానిక వార్డుల్లో పోటీ చేస్తున్న తమ అభ్యర్థులకు పార్టీ ద్వారా రూ.3 కోట్లు పంపిణీ చేశారు.గెలిపిస్తే అర తులం బంగారం!చేవెళ్లలో 16వ వార్డులో పోటీ చేస్తున్న అభ్యర్థి తనను గెలిపిస్తే ఇంటింటికీ అర తులం బంగారం పంపిణీ చేస్తానని కరపత్రం విడుదల చేశారు. ప్రతి పింఛనుదారుకు తన వంతుగా రూ.500, ఆరునెలలు నిండిన గర్భిణులకు పౌష్టికాహారం కోసం రూ.10 వేలు అందిస్తానని ప్రకటించారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే రూ.20 వేలు ఇస్తానని ప్రకటించారు. మొయినాబాద్‌లో ఓ అభ్యర్థి తనను గెలిపిస్తే అర్హత ఉండీ పింఛను రాని వారందరికీ ప్రభుత్వం నుంచి పింఛను వచ్చేదాకా నెలకు రూ.1000 ఇస్తానని హామీ ఇస్తున్నాడు.

వలస ఓటర్లకు వలఉద్యోగాలు, ఉపాధి కోసం హైదరాబాద్, ముంబై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లిన వలస ఓటర్లపైనా అభ్యర్థులు దృష్టి సారించారు. వారికి ప్రయాణ ఖర్చులతో పాటు ఓటుకు కొంత డబ్బులు ఇస్తామని హామీ ఇస్తున్నారు. కొందరికి విమాన టికెట్లూ బుక్ చేస్తున్నారు. ఖర్చులకు ముందుగానే గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు.మంచిర్యాలలో ఓటుకు 2000

మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓటుకు రూ.1500-2000 వరకు పంచినట్లు సమాచారం. బీజేపీ అభ్యర్థులు రూ.1000 వరకు ఇచ్చారు. బీజేపీ నుంచి ఛైర్మన్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నేత తన డివిజన్‌లో ఏకంగా రూ.3 వేలు పంపిణీ చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు రూ.500-1000 వరకు ఇస్తున్నారు. గట్టిపోటీ ఉన్న వార్డులు, డివిజన్లలో అభ్యర్థులు పోటాపోటీగా నగదు పంపిణీకి ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్ని వార్డుల్లో 70-80 శాతం మంది ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు ఒక పార్టీ ఏర్పాట్లు చేసుకోగా, ఏయే వర్గానికి ఎంత ఇవ్వాలన్నదానిపై మరో పార్టీ జాబితాలు రూపొందించుకుంది. 'పది మంది ఓటర్లున్న ఉమ్మడి కుటుంబంలో ఒక ప్యాకేజీ (చికెన్, మటన్, మద్యంతో పాటు రూ.30 వేల నగదు), కీలక ఓటు బ్యాంకు ఉన్న సామాజిక వర్గాలకు మరో ప్యాకేజీ (50-100 ఓట్లు ఉంటే చికెన్, మటన్, మద్యంతో పాటు రూ.50 వేలు)' అందిస్తున్నట్లు ఓ పార్టీ సీనియర్ నేత వెల్లడించారు.

రెబెల్స్ సైతం రెడీ..!

రాష్ట్రవ్యాప్తంగా పలు వార్డులు, డివిజన్లలో రెబెల్స్‌గా బరిలోకి దిగిన అభ్యర్థులు కూడా పెద్దఎత్తున నగదు పంపిణీకి సిద్ధమయ్యారు. కొన్ని వార్డుల్లో ప్రధాన పార్టీల రెబెల్స్ ఐదారుగురు పోటీలో ఉన్నారు. గెలుపుపై ధీమాతో ఉన్న వీరు.. ప్రత్యర్థులకు దీటుగా డబ్బు పంపిణీకి సిద్ధమయ్యారు.






# ఒకవైపు ప్రభాస్.. మరోవైపు పవన్ కళ్యాణ్.. అరుదైన ఫీట్

సినీ గ్లామర్ ప్రపంచంలో అదృష్టం ఎప్పుడు ఎవరిని వరిస్తుందో చెప్పడం కష్టం. కానీ కొందరి విషయంలో మాత్రం ఆ అదృష్టం తలుపు తట్టడమే కాదు. ఏకంగా రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానిస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వీ  గురించి నెట్టింట జరుగుతున్న చర్చ ఇదే. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఈ చిన్నది.. ఇప్పుడు టాలీవుడ్ టాప్ స్టార్స్ సరసన క్రేజీ ఆఫర్లను కొల్లగొడుతోంది. అస్సలు ఎవరూ ఊహించని విధంగా మొదటి సినిమాతోనే ప్రభాస్  వంటి పాన్ ఇండియా స్టార్‌తో జతకట్టడంతో పాటు, ఇపుడు మరో క్రేజీ ఆఫర్‌ను కూడా లైన్‌లో పెట్టిందని సమాచారం.ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న 'ఫౌజీ' చిత్రంతో ఇమాన్వీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. లవ్ స్టోరీలను వెండితెరపై కావ్యంలా మలిచే దర్శకుడు హను రాఘవపూడి, ఈ అమ్మడిని వెతికి పట్టుకున్నారంటేనే ఆమెలో ఏదో మ్యాజిక్ ఉందని అర్థం చేసుకోవచ్చు. 'ఫౌజీ' సినిమా ఓపెనింగ్ రోజున ఇమాన్వీ లుక్ చూసి కుర్రకారు ఫిదా అయిపోయారు. ప్రభాస్ సరసన పక్కా క్లాసిక్ బ్యూటీలా కనిపిస్తూ అందరి దృష్టిని ఇమాన్వీ ఆకర్షించింది. ఈ సినిమా ఇంకా విడుదల కాకముందే.. సోషల్ మీడియాలో ఇమాన్వీ ఫాలోయింగ్ అమాంతంగా పెరిగిపోయింది. ఆమె చేసే ప్రతి పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారుతోంది. తాజాగా ఇమాన్వీకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్- స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి  కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీకి ఒక కీలక పాత్ర లేదా హీరోయిన్‌గా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. సమ్మర్ తర్వాత ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఒకవైపు ప్రభాస్, మరోవైపు పవన్ కళ్యాణ్.. ఇలా ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్లతో సినిమాలు ఒకే అవ్వడం చూస్తుంటే, ఇమాన్వీ టాలీవుడ్‌లో లాంగ్ ఇన్నింగ్స్ ఆడటం ఖాయమనిపిస్తోంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్‌గా కెరీర్ ప్రారంభించిన ఇమాన్వి తన హావభావాలు, డ్యాన్స్‌తో అందరినీ కట్టిపడేసింది. కేవలం డాన్స్ వీడియోస్ కే అమ్మడికి ఫుల్ ఫాలోయింగ్ లభించింది. ఇప్పుడు నటిగా మొదటి సినిమాతోనే పాన్ ఇండియా గుర్తింపు, ఆ వెంటనే పవర్ స్టార్ సినిమాలో అవకాశం అంటే అది అరుదైన ఫీట్ అనే చెప్పాలి. మరి 'ఫౌజీ' విడుదలయ్యాక ఇమాన్వీ క్రేజ్ ఇంకెక్కడికి వెళ్తుందో చూడాలి.  మాత్రమే కాకుండా తనలోని ప్రతిభతో మరింత మంది స్టార్ హీరోల సరసన ఈ ముద్దుగుమ్మ ఛాన్సులు దక్కించుకోవాలని కోరుకుందాం.

